క్లుప్తంగా

సైనికులకు బీజేపీ అభినందన



విజయవాడలీగల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడిచేసిన వీరజవాన్లకు, ఆపరేషన్‌కు నాయకత్వం వహించిన వీర మహిళామణులకు బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా అభినందనలు తెలిపారు. బుధవారం బీజేపీ ప్రాంగణంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, సీనియర్ న్యాయవాదులు వి.రాంప్రసాద్, పిల్లా రవి, అబ్దుల్ మతీన్, ఇతర న్యాయవాదులతో కలిసి గవర్నింగ్ బాడీ సభ్యులు వీరజవాన్లకు అభినందనలు తెలియజేస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి పురస్కరించుకుని వాసవి విజయవాడ ఆధ్వర్యంలో సామారంగంచౌక్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పారిశ్రామికవేత్త చిట్టూరి నాగేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చిట్టా అమర్ సుధీర్, కార్యదర్శి రామచంద్రరావు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో సెమీస్‌కి చేరిన రాష్ట్ర కబడ్డీ జట్టు



విజయవాడస్పోర్ట్స్: బీహార్‌లోని రాజ్ గిరిలో జరుగుతున్న ఖేలో ఇండియా జాతీయ యూత్ గేమ్స్‌లో రాష్ట్ర కబడ్డీ అండర్–18 బాలుర జట్టు సత్తా చాటింది. ఈ నెల రెండున ప్రారంభమైన ఈ పోటీల్లో పూల్ ఎ నుంచి ఏపీ జట్టు బరిలోకి దిగింది. అదే పూల్‌లోని చత్తీస్‌ఘడ్, కర్ణాటక జట్లను ఓడించింది. మరో జట్టు హర్యానాపై ఓడి పూల్ రన్నర్‌గా నిలిచి సెమిస్ లోకి ప్రవేశించి పతకం ఖరారు చేసుకుంది. సెమీస్‌లో మహారాష్ట్రతో తలపడుతుంది. జట్టులోని క్రీడాకారులు విజయవాడ రైల్వేస్టేషన్‌లోని సైకి అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ప్రతిష్టాత్మకమైన పోటీల్లో సెమీస్‌కు చేరిన జట్టును ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

మైత్రి యాడ్స్‌పై బాధితుల ఫిర్యాదు

పటమట(విజయవాడతూర్పు): మాకు లక్ష డిపాజిట్ చేయండి.. మీకు నెలకు రూ. 12 వేలు ఇస్తామని ఓ కంపెనీ సామాన్యులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎనికేపాడు శివాలయం వీధిలోని జిన్నా మార్కెటింగ్ కంపెనీకి చెందిన మైత్రి యాడ్స్ స్కీంకు డబ్బులు కడితే అధిక రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపడంతో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన ముగ్గురు కలిసి రూ. 3.66 లక్షలు కట్టి మోసపోయారు. మొదటి నెల సంబంధిత కంపెనీ రూ.12 వేలు చెల్లించి ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆపేసింది. రెండేళ్ల గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వీరవల్లి గ్రామానికి చెందిన దిండి సుబ్బారావు, అతని భార్య దిండి రంగమ్మ, అత్తయ్య రెడ్డి రమణమ్మ విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదికలో, పటమట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా గంజాయిని విక్రయిస్తున్న ఓ మహిళను ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. సింగ్‌నగర్ స్మైల్ హాస్పటల్ సమీపంలో ఓ మహిళ గంజాయి విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. విజయవాడ వెస్ట్ సేషన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో సిబ్బంది ఆ ప్రాంతంపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఓ మహిళ స్కూటర్‌పై కూర్చొని అనుమానాస్పదంగా బ్యాగుపెట్టుకొని ఉండడంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా ఆమె వద్ద రెండు కిలోల గంజాయి లభించింది. సదరు మహిళ గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కేఎల్‌రావు నగర్ కాలనీకి చెందిన చదల జ్యోతి(34)గా పోలీసులు గుర్తించారు. ముద్దాయిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపింది.

శాశ్వత పరిష్కారం ఏది?

- లోబ్రిడ్జిలో తరచుగా మొరాయిస్తున్న మోటర్లు
- భారీగా ట్రాఫిక్ సమస్యలు
- మరమ్మతులు పట్టించుకోని అధికారులు
- నరకం చూస్తున్న ప్రజలు



వర్షం కారణంగా ఇటీవల లోబ్రిడ్జిలో నిలిచిపోయిన మురుగునీరు (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీని, నగరంలోని ఇతర నియోజకవర్గాలను కలిపే ప్రధాన రహదారుల్లో లోబ్రిడ్జి ఒకటి. అటువంటి కీలకమైన లోబ్రిడ్జి రహదారిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. విజయవాడ నుంచి చెన్నై ఇతర ప్రాంతాలకు వెళ్లే రైల్వే ట్రాక్ దిగువన ఉన్న లోబ్రిడ్జి సుమారు 150 సంవత్సరాలుగా సేవలందిస్తోంది. అయితే పాతబస్తీలో ఏ చిన్నపాటి వర్షం కురిసినా లోబ్రిడ్జిలో వర్షపునీరు భారీగా నిలిచిపోయి రెండు వైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. మొత్తం ట్రాఫిక్ వ్యవస్థ దారుణంగా తయారవటమే కాకుండా ప్రజల రాకపోకలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. లోబ్రిడ్జి దిగువన ఎత్తు లేపటానికి అవకాశం లేదు. అటువంటి లోబ్రిడ్జిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైప్‌లైన్లలో సమస్యలు...

లోబ్రిడ్జిలో వర్షపునీటిని బయటకు తరలించటానికి రైల్వే ట్రాక్ దిగువన డ్రైనేజీ వ్యవస్థ ఉంటుంది. దాని నుంచి నీటిని కెనాల్‌లోకి పంపటానికి మోటర్లను వినియోగిస్తారు. అయితే డ్రైనేజీ నుంచి మోటర్లకు వెళ్లే పైప్‌లైన్లలో సమస్యలు తలెత్తటం, లేదా మోటర్లు పనిచేయకపోవటం తదితర సమస్యలతో నిత్యం వర్షపునీరు భారీగా నిలిచిపోతుంది. దాంతో ప్రజల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. దీనిపై నగరపాలకసంస్థ అధికారులు దృష్టి పెట్టకపోవటంతో సమస్య రానురాను తీవ్రతరం అవుతోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నా అధికారులు ఇంకా పాత పద్ధతులను అనుసరించే చర్యలు చేపడుతున్నారని నగరపాలకసంస్థ సిబ్బందే విమర్శిస్తున్నారు. నీటిని తరలించేందుకు అనుసరించాల్సిన చర్యలపై నిర్దిష్టమైన ఆలోచన చేయకపోవటంతోనే ఈ విధమైన సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



లోబ్రిడ్జిలో నీరు నిలవటంతో కాళేశ్వరరావు మార్కెట్ బస్ టెర్మినల్ వైపు నిలిచిన ట్రాఫిక్ (ఫైల్)

భారీగా ట్రాఫిక్ జాం...

లోబ్రిడ్జిలో వర్షపునీరు నిలిచిపోయిన ప్రతిసారి రెండు వైపులా వందలాది వాహనాలు నిలిచిపోతున్నాయి. వర్షపునీరురు తరలించేందుకు, డ్రైనేజీ వ్యవస్థను తాత్కాలికంగా చక్కదిద్దేందుకు సీవియజ్ వాహనాలను తీసుకొచ్చి అప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. గడిచిన నెల రోజుల కాలంలో కనీసం నాలుగైదు సార్లు ఈ విధమైన సమస్యలు చోటు చేసుకున్నాయి. ఇటీవల తెల్లవారుజామున కురిసిన వర్షానికి లోబ్రిడ్జిలో భారీగా నీరు నిలిచిపోయింది. దీనికితోడు లోబ్రిడ్జి దిగువన ఉన్న డ్రైనేజీ వ్యవస్థలో చెత్త అడ్డుపడి మోటర్లు వేసినా నీరు బయటకు వెళ్లలేదు. దాంతో ఐదారు గంటల పాటు ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

లోబ్రిడ్జి సమస్యను నివారించేందుకు నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని, ఆ దిశగా ఆలోచన చేయాలని వన్‌టౌన్ వాసులు నగరపాలక సంస్థ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలను అందించారు. ముఖ్యంగా లోబ్రిడ్జి డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించటంతో పాటుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమస్యలు లేని నూతన విధానాన్ని ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నేత్రపర్వంగా వాసవి అమ్మవారి జయంతి మహోత్సవం



శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న కమిటీ ప్రముఖులు



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో చిలుక వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు



స్వర్ణ కిరీటాన్ని ధరించిన శ్రీ ప్రార్థనా సంఘం ప్రాంగణంలోని వాసవీ అమ్మవారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం వన్‌టౌన్‌లో బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ తదితర ప్రాంగణాల్లో అమ్మవారి జయంతి వేడుకలను కనులపండువగా నిర్వహించారు.

శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో...

పాతబస్తీలోని శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి స్వర్ణ కిరీటాన్ని అధిష్టింపజేశారు. మందిరం ప్రాంగణంలో 108 మంది మహిళలతో ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ప్రార్థనా సంఘం అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

కొత్తగుళ్ల ప్రాంగణంలో...

కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం స్వర్ణకిరీటంతో అమ్మవారిని అలంకరించారు. ఆలయంలోని వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని అధిష్టింపజేసి లలితా సహస్ర నామాలతో సామూహిక కుంకుమార్చన, పుష్పయాగం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు చిలుక వాహనంపై ఊరేగారు. ఆలయ కమిటీ ప్రముఖులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో పుష్పయాగం

అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో...

పాతబస్తీలోని పురాతనమైన శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ భవనంలో అమ్మవారికి విశేష అభిషేకాలను జరిపారు. ప్రత్యేక అలంకారం చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కమిటీ ప్రముఖుల ఆధ్వర్యంలో విశేష అర్చనలను కొనసాగించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బచ్చు వెంకటప్రసాద్, బయ్యన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో...

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో గల శ్రీకోదండ రామాలయంలో బుధవారం నిర్వహించిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తొలుత 102 కలశాలతో పవిత్ర కృష్ణానదీ జలం, పంచామృతంతో అమ్మవారిని అభిషేకించి అర్చనలు చేశారు. అనంతరం మిత్తింటి వెంకట గురునాథ శివప్రకాష్ దంపతులు వాసవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి వ్రతాల్లో పాగోలు సత్యసాయి శ్రీధర్ దంపతులు, పుష్పయాగానికి సోము రమేష్ దంపతులు, అమ్మవారి ఊంజల్ సేవకు అనంతుల ప్రభాకర్ దంపతులు స్పాన్సర్స్‌గా వ్యవహరించారు. వాసవి క్లబ్ ఉత్సవ్ విజయవాడ కపుల్స్, వాసవి క్లబ్ ఉత్సవ్ విజయవాడ వరిష్ఠ, వాసవి క్లబ్ విజయవాడ సమైక్యత గోల్డ్ సహకారంతో శ్రీశివరామ భక్త మండలి అధ్యక్ష, కార్యదర్శులు జింకా చక్రధర్, పోలు సాంబశివరావు, కోశాధికారి గుగ్గిలం శివనాగ సుబ్రహ్మణ్య గుప్తా, ఉపేంద్ర గుప్తా, కుమారస్వామి, గోవర్ధనరావు నిర్వహించారు.



కృష్ణానదీ జలం తీసుకువచ్చిన భక్తులు

ఏపీ జెన్‌కోలో ఉద్యోగాల పేరిట మోసం

కేసు నమోదు చేసిన పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ వ్యక్తిపై భవానిపురం స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. గొల్లపూడికి చెందిన హిమదుర్గ, బొర్రాగోపినాథ్, కొండపల్లి ధర్మతేజ, శివశంకర్ చిన్ననాటి స్నేహితులు. గతేడాది సెప్టెంబర్ నెలలో బొర్రా గోపినాథ్ తన స్నేహితురాలు హిమదుర్గ వద్దకు వచ్చి ఎన్‌టీటీపీఎస్‌లో టెంపరరీ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.50వేలు తీసుకున్నాడు. ఏపీ జెన్‌కో పేరుతో ఐడీ కార్డు, అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చాడు. వర్క్ ఫ్రం హోమ్ అని చేయమని చెప్పాడు. రెండు నెలల జీతం బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశాడు. ఆ తర్వాత జాబ్ పర్మినెంట్ చేయిస్తానని రూ. రూ.2లక్షలు తీసుకున్నాడు. అతని మాటలు నమ్మిన హిమదుర్గ తన భర్తకు ఉద్యోగం కావాలంటూ మరో రూ.2.50లక్షలు ఇచ్చింది. అతనికి కూడా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చాడు. దీంతో గోపీనాథ్‌ను నమ్మి బంధువులు, స్నేహితుల కలిపి మొత్తం 80 మందిని పరిచయం చేసింది. వారికి అపాయింట్ మెంట్ ఆర్డర్లు ఇచ్చి రూ.80లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరిలో భవానిపురం హెచ్‌బీ కాలనీలోని హెచ్‌ఆర్ టవర్స్ నందు ఎన్‌డీహెచ్‌ఆర్ ప్రాజెక్ట్సు పేరిట ఆఫీస్ ఓపెన్ చేశాడు. గోపీనాథ్ ఎండీగా వ్యవహరిస్తూ ధర్మతేజ, హిమదుర్గను డైరెక్టర్లుగా నియమించాడు. ఆ తరువాత సాయిప్రాజెక్ట్స్ పేరు మీద ఒక్కొక్కరి వద్ద రూ.2వేల చొప్పున 40 మంది వద్ద డబ్బులు వసూలు చేశాడు. అపాయింట్‌మెంట్ ఆర్డర్‌పై హిమదుర్గ సంతకం చేయించాడు. ఈ నేపథ్యంలో గోపీనాథ్ గతనెల 29న అందరికీ జీతాలు ఇస్తానని చెప్పి నమ్మించి కనపడకుండా పారిపోయాడు. దీంతో తాను మోసపోయామని భావించిన హిమదుర్గ భవానిపురం పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖేలో పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

శాప్ చైర్మన్ రవి నాయుడు

విజయవాడస్పోర్ట్స్: బీహార్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిత్యం వహించి వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు అభినందించారు. సెపక్‌తక్రా క్రీడలో రాష్ట్ర మహిళా జట్టు బ్రాంజ్ మెడల్, స్విమ్మింగ్‌లో జి.సంపత్‌కుమార్ యాదవ్ 1500 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్, ఎం.తీర్థసామ్‌దేవ్ 1500 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో బ్రాంజ్‌మెడల్, ఆర్చరీ మిక్స్‌డ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన వైష్ణవి- తృణీష్‌లను ఆయన కొనియాడారు.

అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు స్ఫూర్తి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు స్ఫూర్తి అని ఆచార్య ఎన్జీ రంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్ అన్నారు. స్థానిక గాయత్రీ నగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ సభ్యులు గద్దె చంద్రశేఖర్, కోగంటి ప్రసాద్, కాకాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆటోలో పోగొట్టుకున్న ఓ ప్రయాణకురాలి బంగారు నగలు ఉన్న బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా చల్లపల్లిలో నివాసం ఉంటున్న నాగెండ్ల ఇందిర తన తండ్రి సంవత్సరికం సందర్భంగా భర్త పట్టాభిరాజుతో కలిసి మంగళవారం రాత్రి పూర్ణానందంపేటకు బయలుదేరారు. రాత్రి 8.30 గంటలకు బస్టాండ్‌లో దిగి ఆటో మాట్లాడుకుని పూర్ణానందంపేటకు వెళ్లారు. ఆటో దిగి వారితో పాటు తెచ్చుకున్న సుమారు 250 గ్రాముల బంగారు నగలు ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయారు. భవానీపురానికి చెందిన ఆటోడ్రైవర్ కాళ్ల పైడినాయుడు ఆటోలో బ్యాగ్ ఉండడాన్ని గమనించి రాత్రి 10 గంటలకు పోలీసులకు అప్పగించాడు. బ్యాగ్‌లో లభించిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి బాధితురాలికి సమాచారం అందించారు. బంగారు నగల బ్యాగ్‌ను పోలీసులు బుధవారం ఉదయం 10 గంటలకు బాధితురాలికి అందజేశారు. ఆటోలో మర్చిపోయిన బంగారు నగల బ్యాగ్‌ను నిజాయతీగా అప్పగించిన ఆటోడ్రైవర్‌ను సీఐ నాగరాజు సత్కరించి అభినందించారు.

రోజువారీ విధుల్లో హిందీ భాష పాత్ర కీలకం

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్



టీఓఎల్ఐసీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో రోజువారీ విధుల్లో అధికారిక భాష హిందీ కీలక పాత్ర పోషిస్తుందని విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. టీఓఎల్ఐసీ (టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ) చైర్మన్ నరేంద్ర ఏ పాటిల్ అధ్యక్షతన విజయవాడ రైల్వే ఆడిటోరియంలో బుధవారం టీఓఎల్ఐసీ సమావేశం జరిగింది. హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ డెప్యూటీ డైరెక్టర్ ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ముందుగా ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు, డెప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్యామ్‌సుందర్ సాహుతో కలసి డీఆర్‌ఎం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో రోజువారీ విధుల్లో రాజభాష హిందీ అమలు ప్రయత్నాలను ప్రశంసించారు. టీఓఎల్ఐసీ సమావేశాలు, హిందీ పోటీలు రాజభాష అమలు వినియోగాన్ని మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 'ఆదర్శ్ మండల్ – ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి' అవార్డును సాధించడం పట్ల అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌లో రాజభాష అమలును ప్రోత్సహించేలా హిందీ సెమినార్‌లు, స్మారక కార్యక్రమాలు, హిందీ పఖ్వాడ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీఓఎల్ఐసీ పురోగతిపై సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా గత ఫిబ్రవరి 4 నుంచి 18 వరకు జరిగిన హిందీ ఆధారిత పోటీలలో 42 కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి పాల్గొని ప్రతిభ కనపర్చిన 125 మంది అధికారులు, ఉద్యోగులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుంటుపల్లిలోని చీఫ్ వర్క్‌షాపు మేనేజర్ ఎస్.శ్రీనివాస్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఎఫ్‌సీఐ జీఎం విజయ్‌కుమార్ యాదవ్, రీజనల్ పాస్‌పోర్టు ఆఫీసర్ శివహర్ష తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ బ్రాండ్ ఇమేజ్ టైటిల్ ఎంపిక కమిటీ నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమరావతి రాజధానికి గేట్‌వే నగరమైన విజయవాడకు గుర్తింపు తెచ్చేందుకు నిర్వహిస్తున్న పోటీలలో విజయవాడ బ్రాండ్ ఇమేజ్ టైటిల్ ఎంపికకు కమిటీని నియమించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 వరకు ఔత్సాహికులు తమ బ్రాండ్ టైటిల్, ట్యాగ్ లైన్ ఎంట్రీలను పంపేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 250 ఎంట్రీలు అందాయని చెప్పారు. ఈ నెల 10 వరకు వచ్చిన ఎంట్రీలను క్షుణ్ణంగా పరిశీలించి, బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించామన్నారు. కమిటీలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చైర్మన్‌గా, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి సభ్య కన్వీనర్‌గా, ఆంధ్రప్రదేశ్ హోటళ్ల అసోసియేషన్, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా టూరిజం అధికారి, ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్‌లను సభ్యులుగా నియమించామని వివరించారు.

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని



దుర్గాపురం యూపీహెచ్‌సీలో వ్యాక్సినైజేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భిణులు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయాలని వైద్య సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. బుధవారం ఆమె నగరంలోని పలు యూపీహెచ్‌సీల్లో నిర్వహిస్తున్న వ్యాక్సినైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అందులో భాగంగా దుర్గాపురం యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు నిర్దేశిత సమయంలో టీకాలు వేయాలని, గర్భిణులు తీసుకోవాల్సిన టీకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండండి..

దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. బుధవారం ఆమె తన కార్యాలయం నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులతో మాక్ డ్రిల్‌పై జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు అందరికీ ఆదర్శం

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, తదితరులు

పటమట(విజయవాడతూర్పు): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అందరికీ ఆదర్శమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యసాహసాలను వివరించారు. ఆయన జీవితం ప్రతి భారతీయుడికి మార్గదర్శకమన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని దేశసేవకు ముందుకు రావాలన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు సేవలను కొనియాడారు. చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, అకౌంట్ ఆఫీసర్ సత్యానారాయణ మూర్తి, వీఎంసీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పూజ చేస్తున్న శ్రీకాంత్, బేబీరాణి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ విజయవాడలోని తన కార్యాలయంలో బుధవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధనను ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ వర్తమాన కాలంతోపాటు భవిష్యత్ కాలజ్ఞానాన్ని అందించి ప్రజలకు సన్మార్గం చూపిన గొప్ప రాజయోగి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వేముల బేబి రాణి, విశ్వబ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షులు చిట్టూరి హరీష్, రాష్ట్ర నాయకులు జవ్వాది సుధీర్, మహిళా సంఘం ప్రతినిధి ముందూరి సత్యవతి, ప్రసన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీనది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

తిరువూరు: ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతీ నది పుష్కరాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం తిరువూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు తిరువూరు నుంచి బయలుదేరుతుందని, వివరాలకు 88851 41446 నంబరులో సంప్రదించాలని సూచించారు.